02ATP27.qxd:02ATP27.qxd 19/08/22 10:20 PM Page 1



## అందరూ కలిసికట్టుగా బాల్యవివాహాలను అరికడదాం తహాశీల్దార్ బాలకిషన్


సమావేశంలో మాట్లాడుతున్న తహాశీల్దార్

**బ్రహ్మసముద్రం ఆగస్ట్ 18 ప్రభాత వార్త,** : అందరూ కలిసికట్టుగా బాల్య వివాహాలను అరికట్టాల్సిన అవసరం ఎంతైనావుందని తహాశీల్దార్ బాలకిషన్ అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలమంలో ఎంపిడీఓ వెంకట్‌నాయుడు అధ్వర్యంలో ఛైల్డ్‌లైన్1098 కోఆర్డినేటర్ అదినారాయణ జరిపిన శిశు బాల్యవివాహాల కమిటీ సమావేశంలో తహాశీల్దార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ భాద్యతగా మండలవ్యాప్తంగా జరుగుతున్న బాల్యవివాహాలు శిశుహత్యలువంటి వాటిపై అందరూ కలిసికట్టుగా శ్రమించి అరికట్టాలని అన్నారు,అనంతరం సీడిపీఓ వనజా అక్కమ్మ మాట్లాడుతూ బాల్యవివాహాలు అరికట్టాల్సిన భాద్యత ఒక్క అంగన్‌వాడి కార్యకర్తలకే కాదు ప్రతి అధికారికి,ప్రజలకు అవగాహన కల్గితేనే అధికాలు సహకరిస్తారని అన్నారు.బాల్యవివాహాలవల్ల అడపిల్లల జీవితాలు నాశనం అవుతున్నాయని అన్నారు పిల్లల తలిదండ్రులలో అవగాహన పెరిగి సరైన వయస్సులో వివాహం జరిపితే జీవితంపై అవగాహన కల్గిసంసారజీవితం సుకంగా సాగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో యంఈఓ ఓబుళపతి, డాక్టర్ రాజేష్‌కుమార్,కేజీబీవి యస్ఓ గీతారాణి,అంగన్‌వాడి కార్యకర్తలు,పంఛాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గోన్నారు.

## ఎంపిడిఓను సన్మానించిన ప్రజా ప్రతినిధులు


అధికారిని సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

**శెట్టూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త** : మండల పరిషత్‌లో ఎంపిడిఓగా విధులు నిర్వహిస్తున్న వెంకటనాయుడు పదోన్నతిపై అనంతపురం డ్వామాలోఫైనాన్స్ మేనేజర్‌గా పదోన్నతిపైవెళ్లడం జరిగింది. అందుకుగాను స్థానిక ప్రజాప్రతినిధులు గ్రామ సచివాలయ సిబ్బంది ఉపాధిహామీ సిబ్బంది, మండలఅధికారులు అందరూకలిసి వీడ్కోలుసభ ఏర్పాటు చేయడం జరిగింది. బదిలీపై వెళ్తున్న అధికారిని శాలువాలు బారీ పూలమాలలతో ఘనంగా సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అధికారి చేసిన సేవలను ప్రజా ప్రతినిధులు అందరికీ తెలియజేస్తూ మరెన్నో మహోన్నత పదవులను మీకురావాలని మండల ప్రజల అందరి తరుపున ఆకాంక్షించారు. ఈకార్యక్రమలో స్థానికజడ్పిటిసి మంజునాథ్,ఎంపిపిలక్ష్మిదేవి, సోమనాథ్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ రమాదేవి, ఇన్‌చార్జ్ తహశీల్దారు మహేశ్వరరెడ్డి, ఉపాధిహామీ ఏపిఓ రమేష్, సర్పంచులు విరుపాక్షిగౌడ్, వీరన్న, ప్రకాష్, నాగరాజు, పొన్నూరు స్వామి, కుమార్, మండలంలోని ఎంపిటిసిలు, కోఆప్షన్ నెంబర్ సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యాప్‌ల నమోదుకు నణ్యమైన సాంకేతిక పరికరాలు అందించాలి

### - ఎపిటిఎఫ్ నాయకుల డిమాండ్



మండలంలో నిరసన తెలియజేస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

**శెట్టూరు, ఆగస్టు 18ప్రభాతవార్త** : ఎపిటిఎఫ్-100 రోజులు ఉద య్యమంలో భాగంగా బోధనా సమయానికి ఆటంకం కలిగిస్తున్న ఫేషియల్ అటెండెన్స్ యాప్ రద్దు చేయాల్సిందే అని బోధన విరామ సమయంలో శెట్టూరు మండలం ఎపిటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు, మండల పరిధిలోని అన్ని కాంప్లెక్స్‌ల ప్రధానోపాధ్యాయులకు వినతిపత్రం ఇచ్చి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులురాయల్ వెంకటేష్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు చిత్తయ్య, మురళీలు మాట్లాడుతూ.. నేడు ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న అనవసర యాప్‌లు వల్ల పిల్లలకు బోధన ఆటంకం కలుగుతోందని, ఇలాంటి చర్యలను మానుకోవాలని ఉపాధ్యాయులను కేవలం బోధనకే పరిమితం చేయాలని ఎపిటిఎఫ్ శెట్టూరు మండల శాఖ డిమాండ్ చేస్తోందన్నారు. పాఠశాలకు సంబంధించిన ఆన్‌లైన్ పనులు చేయడానికి నాణ్యమైన సాంకేతిక పరికరాలను ప్రతి పాఠవాలకు అందించాలని ఇది ఇలాగే కొనసాగితే పెన్ డౌన్ కార్యక్రమం ద్వారా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని డిమాండ్ చేశారు.

## గరుడచేడు గ్రామంలో పొలంబడి కార్యక్రమం


పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**కణేకల్లు, ఆగస్టు 18 ప్రభాతవార్త** : మండలంలో గరుడ చేడు గ్రామంలోని రైతు ఎన్. పార్వతమ్మ వేరుశనగ పొలంలో పంటలో పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గ్రామంలోని రైతులు బృందాలుగా ఏర్పాటు చేసి ప్రస్తుత వాతావారణ -వేరుశనగ పంటపై ప్రభావం- తీసుకో వాల్సిన జాగ్రత్త-చేపట్టవలసిన యాజమాన్య పద్దతుల గురించి వ్యవసాయ అధికారి క్షుణ్ణంగా తెలియజేశారు. వేరుశనగ పంట మండలంలో 8354 హెక్టార్లలో సాగులో ఉంది. పంట పైరు 50నుంచి70 రోజుల వయస్సు కలిగి ఉంది. ప్రస్తుతం జిప్సం ఎకరాకు 200 కెజిల చొప్పున చల్లుకుని, కాయలు ఊరేదశలో అంతర సేద్యాలు చేయరాదు, ఆకుపచ్చ తెగుళ్లను గమనించినప్పుడు ఎకరాకు హెక్సాగోనజోల్ మందును 400 ఎంఎల్ పిచికారి చేసుకోవాలి. పచ్చపురుగు కానీ, రబ్బరు పురుగు కానీ ఆశించినప్పుడు క్లోరిపైరిపాస్ 50ఇసి నీటి మందును ఎకరాకు 400 మి.లీ. పిచికారి చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో రైతులకు మిత్తపురుగు, శత్రుపురుగులు, మందులు కొనేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారి చేయుటకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వ్యవసాయ అధికారులు క్షుణ్ణంగా గ్రామ రైతులకు తెలియజేశారు.

## మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిదేవి సోమనాథ్‌రెడ్డి

**శెట్టూరు, ఆగస్టు 18 ప్రభాతవార్త** : మండల కేంద్రంలోని స్థానిక సమావేశ భవనంలో ఎంపిపి లక్ష్మిదేవి సోమనాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సర్వసభ్య సమావేశానికి స్థానిక గౌరవ అతిథిగా స్థానిక జడ్పిటిసి కె.మంజునాథ్ హాజరయ్యారు. మండలంలోని స్థానిక సర్పంచులు ఎంపిటిసిలు, పలు శాఖలకు సంబంధించిన ప్రభుత్వ అధికారులు హాజరు కావడం జరిగింది. వివిధ సమస్యలను స్థానిక సర్పంచులు ఎంపిటిసిలు, అధికారులకు తెలిపారు. అలాగే సమస్యలపై స్పందించిన అధికారులు ప్రజాప్రతినిధులు సమస్యలపై అతి త్వరగా పరిస్కారం అయ్యే విధంగా ప్రజా ప్రతినిధులు స్థానిక అధికారులకు సూచించడం జరిగింది. కొంత మంది ప్రభుత్వ అధికారులు ఈ సమావేశానికి గైర్హాజరు కావడం జరిగింది. ఇన్‌చార్జ్ ఎంపిడిఓ మాట్లాడుతూ.. స్థానిక స్థానిక సమస్యలు ఏవైనా ఉంటే ప్రజా ప్రతినిధులు దృష్టికి తీసుకురావాలని అలా వచ్చిన సమస్యలను తాము పరిష్కరించేందుకు సిద్దంగా ఉన్నామని తెలిపారు. గైర్హాజరైనటువంటి అధికారులను వివరణ కోరతామని సభకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పంచాయితీల సర్పంచులు ఎంపిటిసిలు, గ్రామ కార్యదర్శిలు, ఉపాధిహామీ సిబ్బంది, హార్టికల్చర్ సిబ్బంది, అగ్రికల్చర్ సిబ్బంది, విద్యుత్‌శాఖ వారు, ఆరోగ్యశాఖ వారు ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం


సీతారామ కళ్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

**బొమ్మనహాళ్, ఆగస్టు 18 ప్రభాతవార్త** : మండల పరిధిలోని నేమకల్లు గ్రామంలో వెలిసిన పవిత్ర పుణ్యక్షేత్రమైన ఆంజినేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా 5వ రోజు స్వామివారికి వేద మంత్రాలతో సీతారామ కళ్యాణాన్ని నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు నవీన్‌స్వామి తెలిపారు. స్వామివారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకంలు నిర్వహించి, స్వామి కృపకు పాత్రులైనట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. వారితోపాటు స్వామి దర్శనార్థమై గ్రామ సర్పంచు పరమేశ్వర, భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణం తనిఖీ.. అక్రమ ఎరువులు సీజ్


ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం

**బొమ్మనహాళ్, ఆగస్టు 18 ప్రభాతవార్త** : మండల పరిధిలోని గోవిందవాడ, ఉద్దేహాళ్, ఎల్‌బి నగర్ గ్రామాల్లోగల ఎరువుల దుకాణాలను అనంతపురం స్పెషల్ స్క్వాడ్ ఎడిఎ వెంకటనాయుడు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించామన్నారు. 8 దుకాణాలకు సంబంధించి 12.20 మెట్రిక్ టన్నుల ఎరువులను గుర్తించామని, వాటి విలువ సుమారు 1,44,580 రూపాయలు ఉండవచ్చున్నారు. అంతేకాకుండా ఇంకో రకమైన ఎరువులు 73.0 మెట్రిక్ టన్నులు సీజ్ చేశామని, వాటి విలువ 11,92,779 రూపాయలు విలువ ఉంటుందన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు నిల్వ ఉంచడం చట్టపరమైన నేరమని, కొంత మంది రసాయనిక ఎరువుల దుకాణాయజమానులు వారి స్వలాభాల కోసం ప్రభుత్వం నిర్ధారించిన ధరలకన్నా అధికంగా అమ్ముతున్నారని రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మండల వ్యవసాయ అధికారి అహ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో పీర్ల అగ్నిగుండ ప్రవేశం

### -జలధితో ముగిసిన మోహర్రం వేడుకలు


పీర్ల చివరి దర్శనం

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త** : చిన్న మోహర్రం పండుగలో భాగంగా గురువారం తెల్లవారుజామున పీర్ల అగ్నిగుండ ప్రవేశం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. పెద్ద మోహర్రం వేడుకలు ముగిసిన మరుసటిరోజు నుండి ప్రారంభమైన చిన్న మోహర్రం వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి పెద్ద సరిగెత్తు సందర్భంగా భక్తులు స్వామివార్లకు ప్రత్యేక చదివింపులు నిర్వహించి చక్కెర తులాభారాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గురువారం తెల్లవారుజామున పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేయగా సాయంత్రం వివిధ ప్రాంతాల్లో కొలువుదీర్చిన పీర్లను భక్తులకు చివరి దర్శనం ఇచ్చిన అనంతరం స్థానిక బీబీ జైనబ్బీ దర్గా ఆవరణంలో కలుసుకొని ఆలింగనాల అనంతరం జలధికి తరలించారు. పీర్లకు దారిపోడవుగా భకులు చదివింపులు జరిపారు.

## ఛాయాపురంవద్ద జీబీసీకు గండి..!

### -వృధాగా వంకపాలవుతున్న నీరు


ఛాయాపురం గ్రామంవద్ద జీబీసీ కాలువకు గండి పడిన దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త** : నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం ఛాయాపురం గ్రామంవద్ద 40కిలోమీటరు ప్రాంతంలో జీబీసీ (గుంతకల్లు బ్రాంచి కెనాల్)కు గండి పడింది. కాలువ సైడ్‌వాల్ డెబ్బతిని లైనింగ్ పూర్తిగా శిధిలం కావడంతో బుధవారం రాత్రి గండి పడినట్లు తెలుస్తోంది. దీంతో నీరు మొత్తం పెంచలపాడువైపు వృధాగా పారుతోందని స్థానిక రైతులు చెబుతున్నారు. కాలువకు ఈనెల 15వ తేదీన నింబగల్లు గ్రామం వద్దగల జీబీసీ షెడ్ షట్టర్లు ఎత్తి సాగు, తాగునీటి అవసరాల కోసం విడుదల చేసిన విషయం తెలిసిందే. అధికారులు గండి పూడ్చివేత పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టి నీరు వృధాకాకుండా ముందుకుపారేందుకు చర్యలుతీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయమై జీబీసీ డీఈఈ రామాంజినేయులును పలుకరించగా ఆయన 'ప్రభాతవార్త'తో మాట్లాడుతూ సైడ్ వాల్‌కు రంధ్రం పడటంచేత నీరు వృధాకాకుండా కాలువలో నీటినితగ్గించడం జరిగిందన్నారు. శుక్రవారం ఇసుక బస్తాలువేసి మరమ్మతులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు.

## నేరాలకు పాల్పడితే కఠినచర్యలు - డిఎస్‌పి


అవగహన సదస్సులో మాట్లాడుతున్న డిఎస్‌పి నరసింగప్ప

**గుంతకల్లు టౌన్, ఆగస్టు 18 ప్రభాతవార్త** : ఇరానీ కాలనీవాసులు పద్దతి మార్చుకోకుండా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డిఎస్‌పి నరసింగప్ప హెచ్చరించారు. గురువారం ఒన్‌టౌన్ సిఐ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిఎస్‌పి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో జిల్లా ఎస్‌పితో పాటు ప్రజాప్రతినిధులు ఆధ్వర్యంలో అవగాహన కల్పించినా కాలనీవాసుల్లో మార్పు రాలేదన్నారు. యదాతథంగా దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. కొన్ని రోజుల క్రితం ఏపితో పాటు ఇతర రా ష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడడం అక్కడి సిసి కెమెరాల్లో రికార్డు అయిందన్నారు. అక్కడి పోలీసులు ఆధారాలతో వచ్చి తమ సహకారంతో ఇరానీ కాలనీవాసులను తీసుకెళ్లడం జరిగిందన్నారు. సత్‌ప్రవర్తనతో మెలిగితే ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పినా మార్పు రాకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఇకపై కాలనీకి వచ్చి పోయే అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక నిఘా వుంచనున్నట్లు డిఎస్‌పి పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో టూటౌన్ సిఐ చిన్నగోవిందు, ఎస్‌ఐలు తిరుపాల్, సురేష్, రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ షాపును ప్రారంభించిన ఎమ్మెల్సీ సతీమణి

### -ఘన స్వాగతం పలికిన దుకాణం నిర్వాహకులు

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త** : పట్టణంలోని స్థానిక చర్చి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ముళ్లా బ్రాండ్ గోల్డ్ షాపును గురువారం ఉదయం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవమ్మ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె దుకాణంవద్దకు చేరుకోగానే నిర్వాహకులు జిలాన్‌బాషా తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట విశ్రాంత సీడీపీఓ యం.రామాంజినమ్మ, వైసీపీ ఇతర నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


గోల్డ్ షాపు ప్రారంభోత్సవం లో పాల్గొన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సతీమణి వై.ఉమాదేవమ్మ

## మండలంలో చురుగ్గా ఈ-క్రాప్ నమోదు

### -తప్పక పంటలు నమోదు చేయించుకోవాలంటున్న అధికారులు

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఈ-క్రాప్ నమోదు మండలంలో చురుగ్గా కొనసాగుతోంది. వ్యవసాయశాఖ ఏడీ పద్మజ, ఏఓ శశికళ ఆదేశాల మేరకు వీఏఏ, వీఎస్ఏ, వీహెచ్ఏలు వారి పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి రైతులు పెట్టిన పంటలను నమోదు చేస్తున్నారు. గురువారం వీఎస్ఏ లక్ష్మిదేవి ఉరవకొండ పరిసరాల్లో వేరుశెనగ తదితర పంటలను నమోదు చేశారు. రైతులందరూ వారు సాగు చేసిన పంటలను తప్పక నమోదు చేసుకోవాలని ప్రకృతి వైపరిత్యాలు, ఇతరత్రా పంట నష్టాలు జరిగిన సమయంలో ఈ-క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం పరిహారాలు అందిస్తుందని దృష్టిలో ఉంచుకోవాలని వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

## దీర్ఘకాలిక సెలవుపై ఈఓఆర్‌డీ దామోదర్‌రెడ్డి

### -సర్పంచ్ భర్తతో విభేదాలే కారణమా?

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త** : ఈఓఆర్‌డీ, మేజర్ గ్రామ పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి దీర్ఘకాలిక సెలవు పెట్టినట్లు తెలిసింది. అధికార పార్టీ నేతలకు తలలో నాలుకలాగా వ్యవహరిస్తాడన్న పేరున్న ఆయన్ను ఏరికోరి పార్టీ అదిష్టానం చొరవ తీసుకొని మేజర్ గ్రామ పంచాయతీ ఇంచార్జ్ కార్యదర్శిగా రెండవసారి అదనపు బాధ్యతలను అప్పగించారు. అయితే ఆయన ఇక్కడ ఇంచార్జ్ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి సర్పంచ్ భర్తకు ఆయనకు మధ్య వివిధ అంశాల్లో విభేదాలు తలెత్తినట్లు తెలుస్తోంది. ఈక్రమంలోనే రెండు రోజుల క్రితం పంచాయతీ కార్యాలయంలో ఇరువురి మధ్య వాదోపవాదాలు కూడా జరిగినట్లు సమాచారం. దీంతో ఈఓఆర్‌డీ గురు, శుక్ర, శనివారాలు సెలవు పెట్టగా దాన్ని దీర్ఘకాలిక సెలవుగా మార్చుకోవాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే రంగంలోకి దిగిన అధికార పార్టీ నాయకులు, అధికారులు ఈఓఆర్‌డీ, సర్పంచ్ భర్తకు మధ్య సయోధ్య కుదర్చడానికి యత్నిస్తున్నట్లు సమాచారం.

## వైభవంగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ నాగదేవతల విగ్రహ ప్రతిష్టాపన

### -శాస్త్రోక్తంగా శ్రీ అశ్వర్థనారాయణస్వామి కళ్యాణోత్సవం


ప్రతిష్టించిన విగ్రహాలు

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త** : పట్టణంలోని 10వ వార్డు ఎస్సీ కాలనీలోని శ్రీ పెన్నఓబులేసుస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ శుభకృత్‌నామ సంవత్సరం శ్రావణ గురువారం శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, శ్రీ నాగదేవతల విగ్రహ ప్రతిష్టాపనోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం మేళతాళాలు, వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య ఉత్సవమూర్తులను ప్రతిష్టించి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ అశ్వర్థనారాయణస్వామి కళ్యాణ మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు మీనుగ పెద్దన్న, తొండ్లం రామాంజినేయులు, అన్నదాన కార్యక్రమం దాతలు సర్పంచ్ మీనుగ లలిత, బసవరాజు దంపతులు పాల్గొన్నారు.

## సీట్ల భర్తీకు 29న రెండవ విడత ఆన్‌లైన్ కౌన్సిలింగ్

### -ఉరవకొండ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.నాగరాజు

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త** : ఉరవకొండ ప్రభుత్వ ఐటీఐలో 2022 విద్యా సంవత్సరానికి వివిధ ట్రేడ్లలో మిగిలిన సీట్ల భర్తీకు ఈనెల 29న ఆన్‌లైన్ కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎల్.నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వివిధ ట్రేడుల్లో ప్రవేశం కోసం ఈనెల 24 వరకు ఐటిఐ.ఎపి.జిఓవి.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సాయంత్రం 5 గంటల తరువాత ఆన్‌లైన్‌లో దరఖాస్తు స్వీకరించబడని సర్టిఫికేట్ల వెరిఫికేషన్ దరఖాస్తుల దాఖలు చివరి రోజు జరుగుతుందన్నారు. 26న మెరిట్ లిస్టు జనరేషన్ జరుగుతుందన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసే సమయంలో అభ్యర్థులు ఒకటి కంటే ఎక్కువ ఐటీఐల్లో ఎక్కువ జిల్లాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించిన తరువాత ప్రింట్ అవుట్ నిమిత్తం కంప్యూటర్ రిజిస్ట్రేషన్ నంబర్‌తోపాటు అక్నాలిజిమెంట్ రిసిప్ట్ జనరేట్ అవుతుందన్నారు. దరఖాస్తులో పొరపాట్లు ఉన్నవాళ్లు అభ్యర్థి తమ యొక్క సమాచారం రిజిస్ట్రేషన్ నంబర్, పుట్టిన తేదీ, హాల్ టికెట్ నంబర్లతో ఎడిట్ చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు కౌన్సిలింగ్ రోజు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## కర్నాటక మద్యం స్వాధీనం


కర్నాటిక మద్యాన్ని చూపుతున్న సిఐ

**గుంతకల్లు టౌన్, ఆగస్టు 18 ప్రభాతవార్త** : కర్నాటక మద్యం అక్రమ రవాణాపై దాడులు నిర్వహించినట్లు ఒన్‌టౌన్ సిఐ రామసుబ్బయ్య తెలిపారు. ఇందులో భాగం గా గురువారం శ్రీనివాసులు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 110 కర్నాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ పేర్కొన్నారు.

## సిపిఐలో పలువురు చేరిక


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న సిపిఐ నాయకులు

**గుంతకల్లు టౌన్, ఆగస్టు 18 ప్రభాతవార్త** : మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో 20 కుటుంబాలు గురువారం సిపిఐ పార్టీలో చేరారు. పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి తెలిపారు. ఈ కార్య క్రమంలో నియోజకవర్గం సహాయ కార్యదర్శి మహేష్, మండల కార్యదర్శి రాముడాయల్, సహాయ కార్యదర్శి రామాంజినేయులు, పట్టణకార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యకర్తి ఎస్ఎండి గౌస్, పాల్గొన్నారు.

## కళ్యాణమహోత్సవానికి తరలిరండి

### - ఆలయ వ్యవస్థాపకులు తలారి పరశురాముడు

**గుంతకల్లు టౌన్, ఆగస్టు 18 ప్రభాతవార్త**

మండలంలోని కసాపురం గ్రామం దోసలుడికి క్రాస్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో ఈ నెల 20న నిర్వహించనున్న స్వామివారి కళ్యాణమహోత్సవానికి భక్తులు వేలాదిగా తరలిరావాలని ఆలయ వ్యవస్థాపకులు తలారి పరశురాముడు పిలుపునిచ్చాడు. గురువారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆలయ కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. ఉదయం 7 గంటలకు శ్రీహనుమాన్ చాలీసా 108 మార్లు పారాయణం, 11 గంటలకు శ్రీలక్ష్మీనారాయణస్వామి కళ్యాణం జరగనున్నట్లు తెలిపారు. హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమానికి ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్య క్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర కార్మికశాఖామంత్రి గుమ్మనూరు జయరాం, ఎంఎల్‌సి శివరామిరెడ్డి, ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, తదితరులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం కళ్యాణమహోత్సవానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సమావేశంలో తలారి శకుంతల, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మికాంతరాజారావు, విశ్రాంత తహాశీల్దార్లు చలపతి, ఇఒ రాముడు, సభ్యులు మునీశ్వర్, రామ్‌చరణ్‌తేజ్, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తలారి పరశురాముడు

## వైభవంగా డాక్టర్ మిడతల శివరామప్ప విగ్రహావిష్కరణ

### -హాజరైన దేవాంగుల కులగురువు శ్రీ దయానందపురి మహాస్వామిజీ, మాజీ మంత్రి నిమ్మల క్రిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి-శివరామప్ప దాతృత్వం, సేవలను కొనియాడిన పలువురు వక్తలు


డాక్టర్ మిడతల శివరామప్ప విగ్రహావిష్కరణలో పాల్గొన్న దేవాంగుల కులగురువు శ్రీ దయానందపురి మహాస్వామిజీ, మాజీ మంత్రి నిమ్మల క్రిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాత వార్త** : పట్టణంలో బళ్లారి బైపాస్ రోడ్డులోగల శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవాంగ కళ్యాణ మండపంలో గురువారం ఉదయం స్థలదాత దివంగత డాక్టర్ మిడతల శివరామప్ప విగ్రహావిష్కరణ కార్యక్రమం మేళతాళాల మధ్య వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి దేవాంగుల కుల గురువు శ్రీ దయానందపురి మహాస్వామిజీ, మాజీ మంత్రి నిమ్మల క్రిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిలు ముఖ్య అతిధులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించి డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మిడతల శివరామప్ప దేవాంగ కళ్యాణ మండపం నిర్మాణానికి 69 సెంట్ల స్థలాన్ని విరాళంగా అందించి తన దాతృత్వాన్ని చాటుకొని ఎందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చందా చంద్రమ్మ, జెడ్పీటీసీ ఏ.సి.పార్వతమ్మ, ఉప సర్పంచ్ జి.వన్నప్ప, వైస్ ఎంపీపీ యం.నరసింహులు, పెన్నహోబిళం దేవస్థానం ఛైర్మెన్ యం.అశోక్‌కుమార్, ఆమిద్యాల పీఏసీఎస్ ఛైర్మెన్ బి.తేజోనాథ్, దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు చంగలమహేశ్వర, గౌరవాధ్యక్షులు మిడతల చంద్రమౌళి, ఉపాధ్యక్షులు మిడతల విశ్వనాథ్, ప్రధాన కార్యదర్శులు గుగ్గిళ్ల అమరేశ్వర్, రెడ్డి ఆంజనేయులు కార్యదర్శిగోపాలందత్తాత్రేయ, సహాయకార్యదర్శులు ముక్కర బాలచంద్ర, చింతగింజల ఎర్రిస్వామి, చంగల అమరేష్, గిద్దలూరి శివప్రసాద్‌బాబు, కోశాధికారి నిమ్మల వెంకటరమణ, కళ్యాణ మండపం మేనేజర్ అంపాపతిని చంద్రశేఖర్, స్థలదాత కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

## ఏఈపై దాడిచేసిన సర్పంచును వెంటనే అరెస్టు చేయాలి

### -విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయంవద్ద నిరసనలో విద్యుత్ ఉద్యోగులు


విద్యుత్‌శాఖ డీఈఈ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న విద్యుత్ ఉద్యోగులు

**ఉరవకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త** : విద్యుత్ శాఖ ఉరవకొండ ఏఈ గురుమూర్తిపై అమానుషంగా దాడి చేసిన నెరమెట్ల గ్రామ సర్పంచ్ యోగేంద్రరెడ్డిను తక్షణం అరెస్టు చేసి చట్టపరకంగా కఠినంగా శిక్షించాలని విద్యుత్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఏఈపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ గురువారం ఉరవకొండ డివిజినల్ ఇంజనీర్ కార్యాలయం ముందు వారు బాధిత ఏఈ గురుమూర్తితో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రసాద్, పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ సలీమ్, కార్యదర్శి శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలతోనే విద్యుత్ బిల్లుల మొండి బకాయిలను వసూళు చేసే క్రమంలో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యుత్ కనెక్షన్లను తొలగిస్తున్నామని ఇందులో తమ వ్యక్తిగత కక్షలు ఏమీ ఉండవన్నారు. అయితే ఒక బాధ్యతాయుతమైన, పలువురికి ఆదర్శంగా ఉండాల్సిన సర్పంచ్ స్థానంలో ఉండి ప్రభుత్వ ఆదేశాలు అమలు చేయడానికి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగులకు సహకరించకుండా సర్పంచ్ యోగేంద్రరెడ్డి రాయంపల్లి గ్రామంలో ఏఈ గురుమూర్తిపై పైశాచికంగా దాడి చేయడం హేయమైన చర్యని పేర్కొన్నారు. ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించే ఇలాంటి వ్యక్తులను ఉపేక్షించరాదని చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు విద్యుత్ బకాయిల వసూళ్ల సమయంలో ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. ప్రభుత్వ విధులకు రాజకీయ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు సహకారం అందిస్తే అప్పగించిన పనులు పూర్తి చేయడానికి సులువుగా ఉంటుందన్నారు. ఏఈపై దాడికి పాల్పడిన సర్పంచ్‌తోపాటు అతనికి సహకరించిన వారిని అరెస్టుచేసి కఠినంగా శిక్షించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉద్ధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈలు గంగాధర, విజయ్‌కుమార్, చాంద్‌బాషా, చంద్రమోహన్‌రెడ్డి, ప్రనీష్, బాలచంద్ర, మహేష్, డివిజన్ పరిధిలోని సిబ్బంది పాల్గొన్నారు.

## జీవితంలో ఒంటరి తనం..కడుపులో బాధ..ప్రాణం తీసుకున్న పండు వృద్ధులు

### -కన్నవాళ్లు ఉన్నా కరుణలేక..కష్టాలు వెంటాడుతున్నాయని..

### సామూహిక ఆత్మహత్య -గోరంట్ల మండలం వానవోలులో విషాదం

**గోరంట్ల, ఆగస్టు 18 ప్రభాతవార్త** : జీవితంలో తోడబుట్టిన వారు దూరమై కాటికి కాలుచాపే వయసులో కన్నబిడ్డలు దగ్గర లేక ఒంటరి తనమై జీవిస్తున్న సమయంలో ఆరోగ్యం సైతం సహకరించక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో ఇక కష్టాలు తీరేలాలేవు మన జీవితం వ్యర్థం అని భావించిన ఆ పండు వృద్ధులు తమ నివాసంలో అర్ధరాత్రి సమయంలో క్రిమిసంహారకమందు సేవించి గంటల వ్యవధిలో ఆ వృద్ధులు ఇద్దరు ప్రాణం విడిచి ఒకరి వెంట ఒకరు ముల్లోకాలకు పయనమైన సంఘటన ఆ గ్రామంలో తీవ్ర విషాదం నింపింది. ఈ సంఘటన గోరంట్ల మండలంలోని వానవోలు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుది. ఈ సంఘటనలో బోయ కస్తూరి పాపన్న (65), వెంకటలక్ష్మమ్మ (60)లు సామూహిక ఆత్మహత్యలకు పాల్పడ్డారు. వివరాలు ఇలా వున్నాయి. గ్రామానికి చెందిన బోయ పాపన్న, వెంకటలక్ష్మమ్మ దంపతులకు నలుగురు సంతానం. అందులో లక్ష్మినారాయణ, రమేష్‌లతో పాటు మరో ఇద్దరు కుమార్తెలు వున్నారు. ఈ నలుగురికి వివాహాలు కావడంతో లక్ష్మినారాయణ మినహా మిగిలిన వారు ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అయితే లక్ష్మినారాయణ సైతం ఒకే గ్రామంలో వున్నప్పటికి వేర్వేరు ప్రాంతాల్లో నివాసాలు వుంటున్నారు. అయితే ఈ నేపథ్యంలో వయసు మీద పడ్డ పాపన్న కుటుంబ జీవనం కోసం తరుచూ కొంత కాలం క్రితం దినకూలికి వెళ్లేవాడు. ఆ సమయంలో ఒక సంఘటనలో తన కన్ను శాశ్వతంగా కోల్పోయాడు. అలాగే వెంకటలక్ష్మమ్మ సైతం ఇటీవల తీవ్ర అనారోగ్యానికి లోనైంది. ఈ కారణాలతో కుటుంబజీవనం ఆ వృద్ధులకు అస్తవ్యస్తంగా మారడంతో తమ ఆరోగ్యం సైతం దినదినగండంలా వారిని వేధిస్తుండడంతో మనస్థాపానికి గురై ఆ వృద్ధులు బుధవారం అర్ధరాత్రి విషపుగుళికలు సేవించి ఆత్మహత్య చేసుకున్నారు. ఆలస్యంగా గుర్తించిన గ్రామస్తులు హుటావుటిన ఆ ఇద్దరిని ప్రథమ చికిత్స కోసం గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే వెంకటలక్ష్మమ్మ గోరంట్లకు వచ్చేసరికి మృత్యువాత పడింది. పాపన్న పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు. అయితే ఆయన సైతం మృత్యువాడ పడ్డాడు. వీరి మరణం గ్రామంలో విషాయఛాయలు అలుముకున్నాయి. కాటికి కాలుచాపే సమయంలో కన్నబిడ్డలు దగ్గరలేరని అనారోగ్యానికి గురై మనస్థాపం చెంది కళ్లముందు కనిపించే ఆ వృద్ధులు కానరాని లోకానికి వెళ్లిపోయారని ఆ గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. స్థానిక ఎస్ఐ బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ సంఘటపై కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి జరిగిన సంఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.


సామాహిక ఆత్మహత్యలకు పాల్పడ్డ వృద్ధ దంపతులు

# లబ్ధిదారుల చిరునవ్వులే సంక్షేమానికి నిదర్శనం

**- దేశంలోనే అత్యంత పారదర్శకమైన పాలన - మూడేళ్లలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయి - ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర్ నారాయణ**


ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంకర్ నారాయణ

**పెనుకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త**
లబ్ధిదారుల చిరునవ్వులే సంక్షత్రూనికి నిదర్శనమని పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శకంర్ నారాయణ పేర్కొన్నారు. పెనుకొండ నగర పంచాయితీ 13వ వార్డులో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పరికారు. ప్రతి గడపకు వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలను ఆయన వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా ప్రతి పథకం అర్హులైన లబ్ధిదారులకు అందజేసు_్తన్నామ న్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పట్టణంలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. గడపగడపకు తిరుగుతుంటే ప్రజలు సమస్యలను తెలుపుతున్నారని అన్నారు. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఎటువంటి అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు నేరుగా సంక్షేమ ఫలాలు అందిస్తూ దేశంలోనే అత్యంత పారదర్శకమైన పాలనను జగన్ చేస్తున్నారని అన్నారు. తాము గడపగడపకు వెళ్లిన సందర్భంగాప పలువురు లబ్దిదారులు జగన్ పాలనపై సంతోషం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. లబ్దిదారులచిరునవ్వులే జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమానికి నిదర్శనమన్నారు. గడిచిన మూడేళ్ల పాలనలో రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. ఈ కార్యక్రమంలోజడ్పిటిసి శ్రీరాములు, నగర పంచాయితీ చైర్మన్ ఉమన్ ఫరూక్, వైస్ చైర్మన్ సునీల్‌కుమార్, కౌన్సిలర్లు చంద్రకళ, బోయబాబు, సద్దాం హుస్సేన్, రఘునాథరెడ్డి, మారుతి, భాస్కర్‌నాయక్, మండల పార్టీ, పట్టణ కన్వీనర్ వాల్మీకి నరసింహులు, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సోమందేపల్లి గణేష్, కిష్టప్ప, ఫరీద్, ఎంపిడిఓ నగర పంచాయితీ కమిషనర్ వంశీకృష్ణ, భార్గవ్, ఇతర అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన మసీద్ కాంప్లెక్స్ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి చర్యలు- నగర మేయర్ వసీం


డ్రైనేజీని పరిశీలిస్తున్న మేయర్ వసీం, అధికారులు

**అనంతపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త**
యుద్ధ ప్రాతిపదికన సప్తగిరి సర్కిల్ మసీద్ కాంప్లెక్స్ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను నగర మేయర్ మహ్మద్ వసీం ఆదేశించారు. నగరంలోని సప్తగిరి సర్కిల్ సమీపంలోని మసీద్ కాంప్లెక్స్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న ఫోర్‌లైన్ రోడ్డు పనులు జరుగుతుండటం వల్ల ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ దెబ్బతిని మురుగు నీరు ముందుకెళ్లే పరిస్థితి లేక రోడ్డుపై ప్రవహిస్తోంది. దీంతో అధికారులతో కలిసి మేయర్ వసీం గురువారం మసీదు కాంప్లెక్స్ ప్రాంతాన్ని పరిశీలించారు. మసీదు కాంప్లెక్స్ ముందున్న డ్రైనేజీ నీటిని రోడ్డు అవతలివైపు ఉన్న డ్రైనేజీలోకి కలిపేలా వెంటనే పనులు చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించఆరు. ఫోర్ లైన్ రోడ్డు పనులు చేస్తున్న నిర్వాహకులతో సమన్వయం చేసుకుని వెంటనే సమస్యను పరిష్కరించాలని సూచించఆరు. దీనితో అధికారులు వెంటనే పనులను ప్రారంభించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్ఈ నాగమోహన్, కార్పోరేటర్లు అభూ సాలెహా, బాలాంజినేయులు, సంపంగి రామాంజినేయులు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, డిఇ చంద్రశేఖర్, వైసీపీ నేతలు కాగజ్‌ఘర్ రిజ్వాన్, ఖాజా, కుళ్లాయిస్వామి, దాదు, చిన్నా, ఏఈ బాబావలి తదితరులు పాల్గొన్నారు.

# జగనన్న శాశ్విత భూ హక్కు-భూరక్ష పథకంపై సమీక్ష సమావేశం


మాట్లాడుతున్న నగర పాలక సంస్థ కమిషనర్ భాగ్యలక్ష్మి

**అనంతపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త**
అనంతపురం నగర పాలక సంస్థ-వైఎస్ఆర్ జగనన్న శాశ్విత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా గురువారం రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అనంతపురం కార్యాలయంలో వార్డు అడ్మిన్, అమినిటీస్, ప్లానింగ్, వార్డు రెవెన్యూ, వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా నగర పాలక పరిధిని రీ సర్వే చేయడంపై వివరించడం జరిగింది. సదరు సమావేశంలో సర్వే చేయుటపై పలు సూచనలను కమిషనర్ కె.భాగ్యలక్ష్మి తెలియజేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో రీ సర్వే ఒకటని, నిర్దేశించుకున్న లక్ష్యంలోగా సర్వేను పూర్తి చేయాలని, కాగా శాశ్విత భూ హక్కు-భూ రక్ష పథకం సమీక్షలో భాగంగా కార్యదర్శిలకు, నగరపాలక సిబ్బందికి సమగ్ర భూ సర్వే పనులు ప్రాముఖ్యత, లక్ష్యాలను తెలియజేస్తూ ఈ కార్యక్రమం కింద మొత్తం నగర పాలక సంస్థలో ప్రతి ఎలక్షన్ వార్డు చెప్పున నగరం మొత్తం 16.36ఎస్‌క్యూ.కెఎంను సర్వే చేయాల్సి ఉంటుందని కమిషనర్ కె.భాగ్యలక్ష్మి వివరించారు. సమావేశంలో తహశీల్దారు కార్యాలయం నుంచి వాణి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ జి.రమణారెడ్డి, అసిస్టెంట్ సిటీ ప్లానరన్ శ్రీనివాసులు, నగర పాలక రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, టౌన్ సర్వేయర్, వార్డు కార్యదర్శిలు పాల్గొన్నారు.

# లోక్‌నాథ్ అన్నా.. మీ కుటుంబానికి 6.41 లక్షలు అందాయి

**- మూడేళ్లలో ప్రభుత్వ లబ్ధిని వివరించిన రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**
**- ప్రతి కుటుంబానికి నాలుగైదు లక్షల లబ్ధి- చంద్రబాబు కంటే జగన్‌మోహన్‌రెడ్డి మెరుగైన పాలన అందిస్తున్నారు- రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, చిన్నారికి నామకరం చేస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తిప్రకాష్‌రెడ్డి

**చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 18 ప్రభాతవార్త**
గడపగడపకూ మన ప్రభుత్వం అనే కార్యక్రమం మండల పరిధిలోని న్యామద్దెల గ్రామంలో రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులతో మాట్లాడుతూ.. లోక్‌నాథ్ అన్నా.. ఈ మూడేళ్లలో మీ కుటుంబానికి అక్షరాలా 6,68,040 రూపాయల మేరకు ప్రభుత్వం నుంచి లబ్ధి జరిగిందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలియజేశారు. వైఎస్ఆర్ వడ్డీ (రైతులు), వైఎస్ఆర్ ఆసరా, వై0ఎస్ఆర్ పంటల భీమా, వైఎస్ఆర్ రైతు భరోసా, వైఎస్ఆర్ సున్నా వడ్డీ(డ్వాక్రా), వైఎస్ఆర్ కాపు నేస్తం, వైఎస్ఆర్ పింఛన్ కానుక, వైఎస్ఆర్ ఉచిత పంటల భీమా పథకాల ద్వారా ఎంతెంత మొత్తం ఆ కుటుంబానికి అందింది తెలియజేస్తూ పత్రాన్ని అందజేశారు. ఇంతటి సాయం చేసిన ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదని లోకనాథ్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేతో చెప్పారు. గురువారం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ఎమ్మెల్యే మూడేళ్లలో ప్రభుత్వం నుంచి జరిగిన లబ్ధిని తెలియజేసి పత్రాలను అందేశారు. గత ప్రభుత్వంలో ఎలా ఉండేది. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎలా ఉందని ఎమ్మెల్యే ప్రజలను అడిగారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి ప్రకాష్‌రెడ్డి అయిన తర్వాత తామంతా సంతోషంగా ఉన్నామని మహిళలు పేర్కొన్నారు. పంటల భీమా, రైతన్న నేస్తం పడింది. జగనన్న వచ్చిన తర్వాత అందరూ సుభిక్షంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

**చిన్నారికి నామకరణం చేసిన ఎమ్మెల్యే :** న్యామద్దెల గ్రామానికి చెందిన రవి-మౌనిక దంపతుల చిన్నారికి ఎమ్మెల్యేచేత చేయించారు. తల్లిదండ్రులుకోరగా, ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి భారతి అని నామకరణంచేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి శ్రీశైలం ప్రవీణరమణ, జడ్పిటిసి మైలారపు గోవిందరెడ్డి, నాయకులు రామకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, చైర్మన్లు, డైరెక్టర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, వాలెంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# త్వరలోనే ప్రభుత్వ భవన నిర్మాణాలు పూర్తీ చేస్తాం

**- సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్**


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్, అధికారులు దృశ్యం

**పుట్టపర్తి, ఆగస్టు 18, ప్రభాతవార్త**
రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ ద్వారా చేపడుతున్న భవన నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేస్తామని శ్రీసత్యసాయి జిల్లా సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోన వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర పంచాయతీ రాజ్ కమీషనర్ కోనశశిధర్ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమీషనర్ పనుల పురోగతిపై జిల్లాల వారీగా ఆరా తీశారు. ముఖ్యంగా సచివాలయాలు, ఆర్‌బికెలు, డిజిటల్ లైబ్రరీ, తదితర భవన నిర్మాణపనులపై కలెక్టర్లు నిత్యం సమీక్షించాలని కమీషనర్ ఆదేశించారు. గత 15 రోజులుగా కొన్ని జిల్లాల్లో పనులు ప్రారంభం కాలేదని, ఇకపై ఇటువంటి పునరావృతం కాకూడదని, సాంకేతిక సమస్యల పేరుతో పనులు జాప్యం చేయడం మంచిది కాదని, పనుల భాధ్యత పూర్తీగా పంచాయతీరాజ్ ఇంజనీర్లదే అన్నారు. భవన నిర్మాణ పనులకు అవసరమైన సిమెంట్ సరఫరా కోసం కొన్ని జిల్లాల నుండి వివరాలు అందలేదని, వాటిని తక్షణమే అందించాలని, గత యేడాదిసిమెంట్‌కంపెనీలకు చెల్లించాల్సి న బిల్లులను వెంటనే చెల్లించాలని, శుక్రవారం నాటికి ఎలాంటి బిల్లులు పెండింలో ఉండరాదని ఆదేశించారు. దీనిపై సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ మాట్లాడుతూ, కొన్ని మండలాల్లో రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాయాలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలుతదితర భవన నిర్మాణపు పనులు 40 శాతం పూర్తయ్యాయని, వాటిని త్వరతగతిన పూర్తీ చేసేందుకు గ్రామ, మండల స్థాయి అధికారులను అప్రమత్తం చేస్తామన్నారు. రానున్న 10 రోజుల్లో పనులు పూర్తవుతాయన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి బాలాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు రామాంజినేయులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌పై దృష్టి సారించండి

**- విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ మాజీ విసి బలవీరారెడ్డి**


మాజీ విసి బాలవీ రారెడ్డిని సత్కరి స్తున్న జెఎన్‌టియు విసి రంగ జనార్ధన్

**అనంతపురం సిటీ, ఆగస్టు 18 ప్రభాతవార్త**
ఎన్ఆర్ఐఎఫ్ ర్యాంకింగ్ సాధనపై అవగాహన ఉన్నప్పుడే వాటిని సాధించేందుకు దోహదపడుతుందని విశ్వేశ్వరయ్య టెక్నాలజీ మాజీ విసి బాలవీరారెడ్డి సూచించారు. జెఎన్‌టియు, ఎస్కేయూ, సెంట్రల్ యూనివర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇన్స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్)పై సెమినార్‌ను గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్వేశ్వరయ్య టెక్నాలజీ యూనివర్సిటీ మాజీ విసి బాలవీరారెడ్డి మాట్లాడుతూ.. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధనపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ సాధనపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు క్వాలిటీ జర్నల్స్‌ను చేయాలని సూచించారు. యూనివర్సిటీలో వారి వనరులను పంచు కోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో భాగంగా క్రైటీరియాలను ఎలా వివరించాలి, ఎలా పాయింట్స్ సాధించాలన్న దానిపై ఈ సందర్భంగా ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెఎన్‌టియు, ఎస్కేయూ సెంట్రల్ యూనివర్సిటీ విసిలు రంగ జనార్ధన్, రామకృష్ణారెడ్డి, కోరి, రిజిస్ట్రార్లు శశిధర్, మల్లికార్జున, లక్ష్మణరావు, జెఎన్‌టియు ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

# సాహితీ సవ్యసాచి బోయి భీమన్న

**- ప్రగతిశీల భావాలకు పునరంకితం బోయి భీమన్న సాహిత్య అధ్యయనం**
**- జాతీయ వెబినార్ ముగింపు సభలో వక్తలు**

**అనంతపురం, ఆగస్టు 18 ప్రభాతవార్త బ్యూరో**
ప్రముఖ సాహితీ వేత్త, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న సాహిత్య అధ్యయన ప్రగతి శీల భావాలకు పునరంకితం అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషణ్, భావ విప్లవకవి, అత్యద్భుత శృంగార కావ్యాలు రాసిన బోయి భీమన్న సాహిత్య సవ్యసాచి అని కొనియాడారు. ప్రముఖ సాహితీ వేత్త, పద్మభూషణ్ డాక్టర్ బోయి భీమన్న జీవితం -సాహిత్యం అనే అంశంపై శ్రీశ్రీ కళావేదిక శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ శాఖ, మహాబోధి సాహిత్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సంచాలకులు, ఎస్కేయూ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య జి.బాలసుబ్రహ్మణ్యం సమన్వయకర్త డాక్టర్ బత్తల అశోక్‌కుమార్ కార్యక్రమాన్ని చక్కగా కొనసాగించారు. శ్రీశ్రీ కళావేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి సర్వోత్తమనాయుడు అధ్యక్షత వహించారు. జాతీయ అంతర్జాల సదస్సుకు ముఖ్య అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త బోయి హైమావతి భీమన్న, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు చైర్మన్ మందపాటి శేషగిరి రావు, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాటక రంగ అకాడమి చైర్‌పర్సన్ చామలూరు రాగే హరిత, రాజగోపాల్ హాజరై మాట్లాడారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య వెలుదండ నిత్యానందరావు కీలక ఉపన్యాసం చేశారు. అతిథులుగా శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమాదేవి, జాతీయ మహిళా అధ్యక్షురాలు చిట్టే లలిత, జాతీయ సహాయకార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కట్ల భాగ్యలక్ష్మి, ఏపి హైకోర్టు న్యాయవాది, బిసి ఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు సాకే నరేష్, శ్రీశ్రీ కళావేదిక తిరుపతి జిల్లా అధ్యక్షులు సురేంద్రరొడ్డ, అనంతపురం జిల్లా ఉపాధ్యక్షులు ఇ.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నాటక కర్తగా గేయకర్తగా కవిగా పీఠికా రచయితగా, పత్రికా సంపాదకులుగా తనకంటు ప్రత్యేకమైన విశిష్టమైన స్థానాన్ని సంపాదించుకున్న గొప్ప సాహితీ వేత్త బోయి భీమన్న అన్నారు. ఆదికవి వాల్మీకి, ధర్మవ్యాసుడు, వేదవ్యాసుడు, సరగావాశిష్టం లాంటి పౌరాణిక నాటకాలతో మెప్పించారన్నారు. ఈయన తూర్పుగోదావరి జిల్లా మామిడికుదురు గ్రామంలో 1911 సెప్టెంబర్ 19న జన్మించారని చెప్పారు. ఆయన రచనలు పాలేరు, జన్మాంతర వైరం, రాగవాశిష్టం, గుడిసెలు కాలిపోతున్నాయి. పంచమస్వరం ఆ కాలంలో జనుల పోరాటానికి పునాది వేశాయన్నారు. తొలిసారిగా ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నా.. తర్వాత వివిధ పత్రికల్లో పాత్రికేయుడిగా చేస్తూ తొలితరం పాత్రికేయులుగా ప్రసిద్ధికెక్కారని తెలిపరాఉ. గుడిసెలు కాలిపోతున్నాయి, గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని, 2001లో భారత ప్రభుత్వం భీమన్నని పద్మభూషణ్ అవార్డుతో సత్కరించిందని వివరించారు. 2005 డిసెంబర్ 16న భీమన్న తుదిశ్వాస విడిచినా ఆయన సాహిత్యం స్ఫూర్తి దాయకంగా నిలిచిందన్నారు.

# తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటాం..!

**30 లక్షలతో ఏర్పాటుచేస్తున్న పైపులైన్ పనులకు భూమిపూజ**
**రాప్తాడు నియోజక వర్గ యంయల్‌ఏ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**


తాగునీటి పైపులైన్ నిర్మాణ పనులకు భూమిపూజచేస్తున్న యంఎల్‌ఏ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి,

**ఆత్మకూరు ఆగస్టు 18 ప్రభాతవార్త**
మండలంలో కొన్నేళ్లుగా తాగునీరు సమస్య తీవ్రంగా ఉంటుందని,తాగునీరు సమస్యను తీర్చుటకు వైఎస్ఆర్ ప్రభుత్వం ఆత్మకూరుకు 30 లక్షలనిధులు మంజూరుచేయడం జరిగిందని రాప్తాడు నియోజకవర్గ ఎంఎల్ఏ తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలియజేశారు.గురువారం మండల కేంద్రంలో 3 లక్షలలీటర్లు నీటి సామర్థ్యం కల్గిన సంపు నుంచి ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు నీటిని సరఫరా చేసే పైపులైన్ నిర్మాణ పనులకు జడ్‌పి ఛైర్మెన్ బోయ గిరిజమ్మతోకలిసి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి భూమిపూజ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జడ్‌పి ఛైర్మెన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ సంపు నుంచి ఆత్మకూరు గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్‌లకు రోజు కనీసం 16 గంటలుపాటు నిరంతరాయంగా నీటి సరఫరా జరుగుతుందన్నారు.ఈ పనులను రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు.జల జీవన్ మిషన్ క్రింద 75 లక్షల నిధులతో ఆత్మకూరు పంచాయితీలో ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.ఆత్మకూరు పంచాయితీలో తీవ్ర తాగునీరు ఎద్దడి నెలకున్న గత ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన పరిటాల సునీత ఆత్మకూరు పంచాయితీపై సవతి తల్లి ప్రేమ చూపించారని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు.ఆత్మకూరుకు త్రాగునీరు ఇచ్చే ప్రయత్నం కూడా చేయలేదన్నారు,చెన్నేకొత్తపల్లి మీటింగ్‌లో ముఖ్య మంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నియోజవర్గంలో తాగునీరు పథకాలుకు26 కోట్లు రూపాయలు మంజూరుచేశారని గుర్తుచేశారు. ఇవేకాకుం డా జెడ్పి, మండల పరిషత్ గ్రాంట్లు ద్వారా 3.5 కోట్లు కేటాయించారని తెలిపారు.అనంతపురం పంచాయితీ పరిధిలోనినారాయణపురం, అక్కంపల్లి, రాచానపల్లి, పంచాయితీలకు గత ప్రభుత్వంలో వారానికి ఒక్కసారి నీళ్లు వచ్చే పరిస్థితి ఉండేదన్నారు.ఎన్నికలకు ముందు పిఏబీఆర్ నీళ్లు తీసుకొస్తామని తాను మాటిచ్చానన్నారు.ప్రభుత్వం ఏర్పాడుగానే మూన్నెళ్లలోనే అందుకు సంబందించిన జీవో కూడా తెచ్చామన్నారు.కాని కొన్ని అనివార్య కారణాల వల్ల అది సాధ్యం కాలేదన్నారు. ప్రత్యామ్నాయంగా ఇబ్బందులు పడకుండా గంటకు 40 లక్షల నీళ్ళిచ్చే స్కీంను తీసుకొచ్చామన్నారు.రాచానపల్లి సమీపంలో బోర్లు వేయించి అక్కడ నుంచి నీటిని సరఫరా చేయిస్తామన్నారు.రాప్తాడు నియోజకవర్గం వ్యాప్తంగా తాగునీటి కోసం 50 కోట్లు రూపాయలు ఖర్చు చేసి 2024 ఎన్నికలకు పోతామ న్నారు.అసాధ్యమని చెప్పినా పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చి, సాధ్యంచేశామన్నారు.ఫలితంగా 4 మండలాల్లో భూగర్భజలాలుపెరుగుతున్నాయన్నారు.గత తెలుగుదేశం ప్రభుత్వంలో పాలకులు హామీలు ఇస్తేమేమువచ్చిన తర్వాత అన్ని చెరువులకు నీళ్లచ్చామని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు.హంద్రీ-నీవా ద్వారా,పిఏబీఆర్ కాలువ ద్వారా నియోజవర్గంలోని అన్ని చెరువులకు నీళ్లతో నింపామన్నారు.దీంతో 3700 ఎకరాలు సాగయ్యేలా చేశామన్నారు.ఈ కార్యక్రమంలో యంపిపి హేమలత,వైస్‌యంపిపి నీలమ,వైఎస్ఆర్ పార్టీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, అతికిరెడ్డి, వెంకటరామిరెడ్డి, కొండారెడ్డి,సుధాకర్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, ఫణీరెడ్డి, వాసదేవరెడ్డి,బాలపోతన్న,కార్యకర్తలు పాల్గొన్నారు.


నూతన పైపులైన్ పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఏ,జడ్పీచైర్మెన్

# ఆర్ఓబి నిర్మాణం కోసం భూముల పరిశీలన


భూములను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

**పెనుకొండ, ఆగస్టు 18 ప్రభాతవార్త**
కియా పరిశ్రమ సమీపంలో ఆర్ఓబి నిర్మాణం కోసం గురువారం పెనుకొండ సబ్‌కలెక్టర్ నవీన్ పరిశీలించారు. పెనుకొండ మండలం ఎర్రమంచి గ్రామ పొలం ఆర్ఓబి నిర్మించడానికి 31.85 ఎకరాలకు అవసరమని గుర్తించారు. భూ సేకరణలో భాగంగా భూములను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఎర్రమంచి గ్రామ పొలంలో 14 మంది రైతులకు సంబంధించి 17.17 ఎకరాలు పట్టా భూమి, 13 మంది రైతులకు చెందిన 3.25 ఎకరాల అసైన్డ్ భూమి 11.43 ఎకరాల ప్రభుత్వ భూమి భూ సేకరణ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఏపి ఐఐసి జోనల్ మేనేజర్, కియా లీగల్ అడ్వైజర్, తహాశీల్దారు, మండల సర్వేయర్, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, సెరికల్చర్ డిపార్ట్‌మెంట్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డుప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించండి

**- ఇతర ప్రభుత్వ విభాగాలతో కలిసి బ్లాక్ స్పాట్ పరిశీలించిన చర్యలు చేపట్టండి**
**- రోడ్డు భద్రతా ఉల్లంఘణదారులపై చర్యలు తీసుకోండి- జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి**



**అనంతపురం క్రైం, ఆగస్టు 18 ప్రభాతవార్త**
జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణపై దృష్టిసారించాలని జిల్లా ఎస్పీ పక్కీరప్ప కాగినెల్లి ఆదేశించారు. జిల్లాలోని జాతీయ, ఇతర ప్రధాన రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్స్‌ను ఎన్‌హెచ్ఎఐ, ఆర్‌టిఎ అధికారులతో కలిసి సందర్శించి రోడ్డు ప్రమాదాలుచోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అంతేకాకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించని ఉల్లంఘనదారులపై పక్కాగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలలో భాగంగా, వాహన చోదకుల వద్ద డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ఫోర్ వీలర్ డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలి. మద్యం సేవించి వాహనం నడుప రాదు. వన్‌వేలలో వాహనం నడుపరాదు. నో పార్కింగ్ ప్రదేశాలలో పార్కింగ్ చేయరాదని పలు సూచనలు చేశారు. ఈ నిబంధనలు పక్కాగా పాటించాలని ఒకవేళ ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల న్నారు. జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటే వెంటనే డయల్ 100 లేదా జిల్లా పోలీసు వాట్సాప్ నెంబర్ 9989819191కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.